క్లుప్తంగా

ఎస్ఐను సస్పెండ్ చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: వెదురుకుప్పంలో రైతు చంద్రశేఖర్ మరణానికి కారకులైన ఎస్ఐను సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికార దర్పంతో రైతుపై చేసుకోవడమే కాకుండ పోలీసుస్టేషన్‌లో అవమానపరచడం దారుణమన్నారు. ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేసి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

చిత్తూరులో కేంద్ర బలగాల కవాతు



చిత్తూరు నగరంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు నగరంలో శుక్రవారం కేంద్ర బలగాలు కవాతును నిర్వహించాయి. టూటౌన్ సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రసాద్ బలగాలతో పాటు కవాతులో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అందరూ సహకరించాలని పోలీసులు కోరారు. ఓటు హక్కును ఉపయోగించుకోవడానికి పోలీసు శాఖ ప్రశాంత వాతావరణం కల్పిస్తుందన్నారు.

నియమావళిపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: ఎన్నికల కమిషన్ నియమావళిని పాటించకుండా నిర్లక్ష్యం వహించకండని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వలంటీర్లు, ఆశావర్కర్లు, ఆయాలు, సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వం చేత గౌరవవేతనం పొందుతున్న ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రచారాల్లో, బహిరంగ సభల్లో పాల్గొనకూడదని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఎన్నికలకు సంబంధించి గొడవలు జరిగినప్పుడు, ఓటర్లకు వస్తువు రూపంలో నగదు, బహుమతులు అందజేస్తున్నప్పుడు వెంటనే తహసీల్దార్‌కి తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, డీటీలు కవిత, మునికృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీధర్

బంగారుపాళెం: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ శివశంకర్, తహసీల్దార్ సుభద్రమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నవారు రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థుల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రచారాల్లో పాల్గొంటే ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలకు సంబంధించిన నాయకులకు అధికారులు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయం ఏఓ శ్రీధర్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు జయలక్ష్మి, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని అలంకరించారు. విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేలూరు నుంచి తిరుపతికి వెళ్తున్న బస్సు పల్లూరు గ్రామానికి చెందిన శ్వేత(29) రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టింది. దీంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జగనన్నను గెలిపించడానికి సిద్ధం





చిత్తూరు: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, పూతలపట్టు: లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

- 99 శాతం హామీలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సునీల్‌కుమార్, విజయానందరెడ్డి
- పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం

పూతలపట్టు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి జనం సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పి.కొత్తకోట పంచాయతీ పరిధిలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేసి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదవాళ్లకు పథకాలను అందించిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రెండేళ్లు కోవిడ్‌తో దేశం యావత్తు అతలాకుతలమైనా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మాత్రం ఆపకుండా అమలు చేశారని గుర్తుచేశారు. జగనన్న అధికారంలో వచ్చినప్పటి నుంచి చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షం, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. వాటిని ప్రజలు తప్పక గమనించాలని సూచించారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలుచేసి పేదల స్థితిగతులను మార్చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్ని జెండాలు జతకటినా వచ్చే ఎన్నికలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో తిరుగుతుంటే ఆడపడచులందరూ జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు 40 రోజులు ఉండడంతో కార్యకర్తలు, నాయకులు అందరు కలిసికట్టుగా కృషి చేసి మరోసారి జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంత మంది ఎన్ని చెప్పినా ఓటు మాత్రం ఫ్యాన్ గుర్తుకే వేస్తామని యువకులు చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలు ఇళ్ల ముంగిటకే తెచ్చిన ఘనత జగనన్నకే దక్కిందని, విద్య, వైద్యం, ఫ్యామిలీ డాక్టర్, రైతు భరోసా, చేయూత తదితర పథకాలను ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచులు పద్మజారాణి, మాసిలామణి, ఎంఎస్ మణి, ఎంపీటీసీలు దేవిక, యతీష్, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, నాయకులు నాగరాజ, షణ్ముగం, బాలాజీ, వెంకటరమణ, జయపాల్, అమర్‌నాథ్, రాజేంద్రన్, వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి, సేవాదళ్ అధ్యక్షులు భరత్, ప్రకాష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మొగిలిరెడ్డి, సుధా, మోహన్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న వెంటే జనం

చిత్తూరు రూరల్: స్వార్థ రాజకీయాల కోసం టీడీపీ జతకడితే, జనం కోసమే జగనన్న నిరంతరం శ్రమిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు మండలం తొప్పాతిపల్లి పంచాయతీలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేసిన సంక్షేమ ఫలాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు కనిపించని టీడీపీ నాయకులు ఎన్నికలు దగ్గరపడే సమయానికి తొంగి చూస్తారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజా బలాన్ని జీర్ణించుకోలేని తమ్ముళ్లు అడ్డదారిలో జగనన్న సైన్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఒంటరిగా జగనన్నను ఢీ కొట్టే సత్తాలేదన్నారు. ఈ కారణంగా ఎలాగైనా గెలవాలని పలు పార్టీలతో జతకడుతున్నారని విమర్శించారు. అయితే ప్రజలు జగనన్న వైపే చూస్తున్నారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీతో గెలవడం కాయమన్నారు. మరో మారు ప్రజలంతా జగనన్నకే పట్టం కట్టనున్నారని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో తెలుగు తమ్ముళ్లు చేసే అరాచకాలను సామాన్య ప్రజలే తిప్పికొడుతున్నారన్నారు. పచ్చ భూతాలు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని చెప్పారు. భయభ్రాంతులకు గురికావద్దని పేర్కొన్నారు. కచ్చితంగా పార్టీ పరంగా వైఎస్సార్‌సీపీ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇన్నాళ్లు సేవ చేసిన జగనన్నకు ప్రతిఫలంగా ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జయరాం, మండల కన్వీనర్ త్యాగరాజులు, సర్పంచులు, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సంపత్, మణినాయుడు, కుమార్, జయపాల్, భాస్కర్‌రెడ్డి, సుధీర్, క్రిష్టారెడ్డి, బాబురెడ్డి, రాజా, మనోహర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆత్మజ్ఞాన ప్రవచనాలు

తవణంపల్లె: మండలంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఈ నెల 23, 24వ తేదీల్లో రెండు రోజులపాటు ఉచితంగా ఆత్మజ్ఞాన ప్రవచనాలు (బోధన) ఉంటాయని జిల్లా పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.గోపాలకృష్ణ మూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. 23వ తేదీన శనివారం నెల్లూరు శ్రీ ఆంజనేయ పిరమిడ్ ధ్యాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షురాలు చైతన్యలక్ష్మి ఉన్నతి స్థితిని పొందడం ఎలా అనే అంశంపై ఆత్మజ్ఞాన బోధన, 24వ తేదీన ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో ఆత్మజ్ఞాన బోధన ఉంటుందని వివరించారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

పూతలపట్టు: ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. మండలంలోని పి.కొత్తకోట సమీపంలో ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రజ్ఞా సదస్సును నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సాంకేతిక శాస్త్రవేత్తలు భవని కుమార్, ప్రకాష్ హాజరయ్యారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 50 కళాశాలల నుంచి 110 మంది హాజరైనట్లు తెలిపారు. 86 మోడల్ ప్రాజెక్టులు వచ్చాయని పేర్కొన్నారు. పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపల్ నవీన్ కిలారి, కన్వీనర్ మల్లికార్జునయ్య, తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల నూతన కమిటీ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్.గణపతి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, గౌరవాధ్యక్షులుగా గంగరాజు, సలహాదారులుగా నాగరాజ, నాగేశ్వరరావు, యేసుపాదం, కార్యనిర్వాహక అధ్యక్షులుగా లోకనాథం, బాబు, దొరస్వామి, ఉపాధ్యక్షులుగా వరలక్ష్మి, వడివేలు, సరసమ్మ, కార్యదర్శులుగా వెంకటేష్, యేసుపాదం, రాణి, రాజ తదితరులతో కలిపి 15 మందిని ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలోకి కార్మికులు భారీగా చేరడం అభినందనీయమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తాము ముందుంటామన్నారు.

సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు



కట్టకిందపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: సామాన్యులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని మండల వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ వినయ్‌కుమార్ 47 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు, మాత్రలు అందజేశారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. మంచి పౌష్టికాహారం, తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని, ఐరన్ మాత్రలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లలో చైతన్యం రావాలి



జానకారపల్లెలో రంగవల్లులు వేసి, ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

చిత్తూరు అర్బన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సూచించారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని జానకారపల్లె, గాయత్రినగర్, మాపాక్షి సచివాలయాల పరిధిలో మహిళలతో ర్యాలీలు, రంగోలి కార్యక్రమాలు నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చాలా కీలకమైనదని, మంచి వ్యక్తిని ఎన్నుకోవడానికి మహిళల్లో చైతన్యం రావాలన్నారు. ఇందుకోసం ఓటు ఉన్న ప్రతీ మహిళా పోలింగ్ రోజున తన ఓటుహక్కును ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

27న కాణిపాకం హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 27న బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించే స్వామివారి హుండీ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఈఓ కోరారు.

క్విజ్ పోటీల్లో ఆర్‌కే విద్యార్థుల ప్రతిభ



క్విజ్ పోటీల్లో బహుమతులు అందుకుంటున్న ఆర్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: క్విజ్ పోటీల్లో ఆర్‌కే కళాశాలలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రజ్ఞ 2కే 24 టెక్నికల్ సింపోసియం కార్యక్రమానికి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. అక్కడ నిర్వహించిన బిజినెస్ క్విజ్‌లో ముక్త, సాయి మొదటి బహుమతి, టెక్నికల్ క్విజ్‌లో తబసుంబేగం, హేసింధు, హర్షిత మొదటి బహుమతులు, వంశీ, ప్రవీణ్, కిషోర్, అభిషేక్ రెండో బహుమతులు పొందారన్నారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, ఇంజినీరింగ్ విద్యార్థులతో పోటీపడి గెలుపొందడం గర్వకారణమని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. వేకువ జామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం నందీశ్వరుడికి పసుపు, కుంకుమతోపాటు ఆవు పాలతో అభిషేకం చేశారు. స్వామివారిని సుగంధ భరిత పుష్పాలతో విశేషంగా అలంకరించి. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

నగరంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఏఆర్వో, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని 97, 99, 83, 123, 150 పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారుల పేర్లు, హోదా, ఫోన్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయిస్తున్నారు. స్థానిక ఓటర్ల సౌకర్యార్థం, సులభంగా వివరాలు తెలుసుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రం గోడపై వివరాలను రాయిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ పోలింగ్ కేంద్రం నెంబరు, బీఎల్ఓ, సెక్టార్ అధికారి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఏఆర్వో, ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వారి పేర్లు, ఫోన్ నంబర్లను సూచిస్తామన్నారు. కార్పొరేషన్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇదే తరహాలో పేర్లు, ఫోన్ నంబర్లను గోడపై స్పష్టంగా రాయించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంఈ లోకేష్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జల సంరక్షణ మనందరి బాధ్యత



టేకుమంద జెడ్పీ హైస్కూల్లో జల ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: జల సంరక్షణ మనందరి బాధ్యత అని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వేణురెడ్డి అన్నారు. మండలంలోని టేకుమంద జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సకల జీవకోటికి ప్రాణాధారం నీరే అని అన్నారు. మానవుని నిర్లక్ష్యం కారణంగా భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలను పెంపొందించుకునే అవకాశాలను మెరుగు పరచుకుని నీటిని కాపాడుకోవాల్సిన కర్తవ్యం అందరిపై ఉందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న జలవనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు విజయకుమారి షంషీర్‌ఖాన్ మాట్లాడుతూ, నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందుకు అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని భూగర్భజలాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రామన్ సైన్స్ క్లబ్ సభ్యులు నీటి బిందువు ఆకారాన్ని ఏర్పాటు చేసి నీటివనరులను సంరక్షిస్తామని జల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవకి, కేశవులు, వెంకటస్వామి, జయప్రకాష్, వెంకటరమణ, సుభలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక అభిషేకాలు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజిమ్మాపురంలో ఉన్న ఎల్లమ్మతల్లికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనంతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పూజ, పొంగళ్ల సామగ్రిని పంబవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగింపుగా తీసుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక దీపారధనలు చేశారు. సాయంత్రం అర్చకులు అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. మొక్కుబడి ఉన్న భక్తులు పిండి దీపాలు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా ఆరాధన ఉత్సవాలు

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలోని కంచికామకోటి పీఠాధిపతుల సన్నిధిలో ఆరాధన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. కంచికామకోటి పీఠాధిపతుల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి అర్చనలు చేశారు.





పాలసముద్రం: విశేషాలంకరణలో ఎల్లమ్మతల్లి, పొంగళ్ల సామగ్రి ఊరేగింపులో మహిళలు